
# గుణపాఠం

— ప్రేమేంద్ర



ఆరోజు ఆదివారం ఇంట్లోనే వున్నాను. ఆరోజు దినపత్రిక తిరగేస్తుంటే, నిజం చెప్పొద్దూ- అసహ్యమేసింది. ఎక్కడ చూసినా అశాంతి, అభద్రత... కొట్లాటలు... కుమ్ములాటలు... మానభంగాలు, రాజకీయ నాయకులు ఒకరిమీద మరొకరు బురదజల్లుకోవడాలు... ఇవే తప్పించి, మంచి వార్తలు అగుపిస్తే ఒట్టు. పత్రిక మడతబెట్టి, పక్కన పెట్టేశాను.

అంతలో, వీధి తలుపు తట్టిన శబ్దం వినిపించింది. ఎవరొచ్చి వుంటారా అని ఆలోచిస్తున్నంతలో మా మనుమరాలు మాధవి పరిగెత్తుకుంటూ వచ్చింది.

''తాతయ్యా... తాతయ్యా... రామూర్తి తాతయ్య వచ్చారు.'' అంది.

''రమ్మనమ్మా ఇక్కడికి...'' అన్నాడు.

మాధవి వెళ్లిపోయిన మరుక్షణం, రామూర్తి నేనున్న గదిలోకి వచ్చేశాడు.

''రారా మూర్తీ, కూచో. ఈ మధ్య అగుపించడమే మానేశావేమిట్రా?'' అన్నాను సన్నగా నవ్వుతూనే.

రామూర్తి, నాకు అభిముఖంగా సోఫాలో ఆశీనుడయ్యాడు.

''ఒక విషయంలో కాస్తంత బిజీ అయ్యాన్రా...'' మెల్లగా అన్నాడు.

''ఏవిటి? ఇంటి విషయమా?''

''కాదు. వింటే నువ్వు కోపగించుకుంటావు...'' నసిగాడు మూర్తి.

''నేను కోపగించు కోవడమేమిటీ? నాకు సంబంధించిన విషయమా?''

''కాదు. నాకు సంబంధించిందే''

''అయితే నాకెందుకు కోపం?'' ఆశ్చర్యంగా మూర్తికేసి చూశాను.

''ఈ విషయాన్ని నీతో ముందుగా చెప్పలేదు గాబట్టి'' మొహం దించుకునే అన్నాడు, రామూర్తి.

ఇప్పుడు నాకు అర్థమయ్యింది.

రామ్మూర్తీ, నేను మంచి స్నేహితులం. ఒకేరోజు ఒకే ఆఫీసులో ఉద్యోగంలో చేరాము. ఇటీవల ఒకేరోజు ఇరువురమూ పదవీ విరమణ చేశాం. అందుకే, ఆ సాన్నిహిత్యం మా ఇరువురి మధ్య ఏనాడూ అభిప్రాయ భేదం రాలేదు. మా ఇరువురి మధ్య రహస్యాలంటూ లేవు. ఏవేం చేసినా, పరస్పరం చెప్పుకునేవాళ్ళం. అందుకే గామోసు, రామ్మూర్తి అంతగా సందేహిస్తున్నాడు, ఏదో విషయాన్ని నాకు ముందుగా చెప్పనందుకు.

''సరేలేరా! ఇప్పుడు చెప్పు, విషయం యేవిటో'' అన్నాడు సన్నగా నవ్వుతూ.

''మునిసిపల్ కార్పొరేటరుగా మన వార్డునుంచి నేను పోటీ చేస్తున్నాన్రా'' అన్నాడు.

నా పక్కనే బాంబు పడినట్టయింది నాకు. రాజకీయ రంగాన్నే అసహ్యించుకొనే రామూర్తి, బొత్తిగా రాజకీయ పరిజ్ఞానమే లేని రామ్మూర్తి, రాజకీయ రంగప్రవేశం చెయ్యడమా? నేను నమ్మలేక పోయాను. కాని వాడే స్వయంగా చెబుతూ వుంటే, నమ్మక పోవడం ఎలా?

''నిజంగానా?'' ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ అన్నాడు.

''ఔన్రా నారాయణా. నిజంగానేన్రా''

''నాతో చెప్పకుండా యే పనీ చెయ్యని నువ్వు, మాటవరసకైనా నాతో అనకుండా ఈ నిర్ణయం తీసుకున్నావంటే ఆశ్చర్యంగా వుందిరా'' అన్నాను.

రామూర్తి, మొహం దించుకున్నాడు.

''నీకు కోపం వస్తుందని అందుకే అన్నాన్రా! క్షమించరా నారాయణా నీతో చెబితే, నువ్వు నిరుత్సాహ పరుస్తావని, నేనే ఈ నిర్ణయాన్ని తీసుకున్నాను. మరేం అనుకోకురా'' అన్నాడు రామూర్తి.

''అంటే, కార్పొరేటర్ కావాలన్న కాంక్ష నీలో గాఢంగా వుందన్నమాట. రాజకీయాలంటే, ఆసక్తి బొత్తిగాలేని వాడివి... నీలో ఈ ఆలోచన రావడానికి ప్రేరణ యెవర్రా? ఆ రాజారావేనా?'' అన్నాడు సాలోచనగా.

రామూర్తి ఆశ్చర్యంగా నాకేసి చూశాడు.

''ఆ విషయాన్ని నువ్వెట్లా వూహించావురా నారాయణా?'' అన్నాడు.

''ఊహించడానికే ముందిరా! రాజారావు సంగతి నాకు బాగా తెలుసు. అతని వృత్తి యేదయినా ప్రవృత్తి మాత్రం రాజకీయాలే! ఇటువంటి వ్యక్తుల్లో నీతి, నిజాయితీ, నిజమైన దేశభక్తి కాగడాపెట్టి వెదికినా కనిపించవు. ఎటు గాలివీస్తే అటే ఒరిగిపోతారు. స్వార్థం మినహా మరొకటి వారికి తెలీదు. ఇటువంటి వ్యక్తి మాటలు విశ్వసించి రాజకీయాలంటే యావగించుకునే నువ్వు ఈ రొంపిలోకి దిగావంటే, నాకే నమ్మబుద్ధి కావడంలేదురా రమ్మూర్తీ!'' నా మనసులోని మాటని అనేశాను.

రామ్మూర్తి మొహంలో రంగులు మారినయ్. గట్టిగా ఓ నిట్టూర్పు వదిలాడు.

''ఒరేయ్ నారాయణ, ఈ ఒక్క విషయంలో మాత్రం నన్ను క్షమించురా. రాజారావు వాళ్లంతా ఎంతో స్నేహపూర్వకంగా ఆత్మీయంగా నన్నాదు కుంటున్నార్రా! నాలాంటి ఓ అనుభవజ్ఞుడు మన వార్డుకి కార్పొరేటర్గా రావడం ఎంతో అవసరమంటున్నారు వాళ్ళు. నాకు తమ పూర్తి సహకారం వుంటుందని, ఖచ్చితంగా గెలిపిస్తామని వాగ్దానం చేశారు. వాళ్ల మాటలు చూస్తుంటే, మన వార్డులో వాళ్లకి గట్టి పట్టు వున్నట్టే అనిపిస్తోందిరా! జీవితంలో ఇంతవరకూ నేనేమీ చెయ్యలేక పోయాను. నా శేష జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చెయ్యాలన్న సదుద్దేశం ఇప్పుడిప్పుడే కలుగుతోందిరా నారాయణా! అందుకే, రాజకీయ రంగంలోకి దిగాన్రా!'' అన్నాడు, రామ్మూర్తి.

రామ్మూర్తి ఆంతర్యం ఇప్పుడర్థమయ్యింది. ఇంక వాడికి యేం చెప్పినా అరణ్య రోదనే అవుతుందను కున్నాను. వాడిలో పాతుకుపోయిన పదవీ కాంక్షని తుడిచిపెట్టడం, బ్రహ్మదేవుడి తరం కాదనుకున్నాను. ఈ పరిస్థితిలో వాణ్ణి నిరుత్సాహపర్చడం సబబు కాదనిపించింది. మెల్లగా మందహాసం చేశాను.

''ఒరే రామ్మూర్తీ, నీ పరిస్థితిని అర్థం చేసుకున్నాన్రా. అప్పుడే రంగంలోకి దిగిపోయావు కాబట్టి నిన్ను నిరుత్సాహపర్చడం నాకిష్టంలేదు. ఈ ఎన్నికల్లో నువ్వు విజయం సాధించాలని మనసారా కోరుకుంటున్నాను నాకు చేతనైన సహకారం చేసూ అందిస్తాను'' అన్నాను.

రామ్మూర్తి మొహం ఆనందంతో వికసించింది. ఉత్సాహంగా లేచి, నా రెండు చేతులూ పట్టుకున్నాడు.

''చాలా థాంక్స్రా నారాయణ! ఆపాటి హామీ నీనుంచి లభించిందంటేనేను విజయం సాధించినట్టే! వెళ్లొస్తాను. చాలా పనులున్నాయి'' అంటూ లేచాడు రామ్మూర్తి.

''కాస్సేపు కూచోరా కాఫీ తీసుకుని వెళ్దువుగాని'' అన్నాను.

''ఈసారి వచ్చినపుడు తీసుకుంటాన్లేరా! వస్తాను మరి'' అంటూ నిష్క్రమించాడు, రామ్మూర్తి.

సన్నగా నవ్వుకున్నాను నేను.

★★★

రాజారావు, అతని బృందం రామూర్తి గెలుపుకోసం పన్జేస్తున్నారు. అయితే, రామ్మూర్తికి మంచినీళ్ళ ప్రాయంగా డబ్బు ఖర్చవుతోంది. పైకి చెప్పుకోలేని పరిస్థితి వాడిది.

ఎలక్షన్ ముందురోజు రామ్మూర్తి ఇంటికి వెళ్లాను. వాడిచుట్టూ రాజారావు అతని బృందం హడావిడిగా వున్నారు. రామ్మూర్తి మొహంలో అలసట, నిరుత్సాహం, స్పష్టంగా అగుపిస్తున్నాయ్. వాడు నన్ను చూళ్లేదు. రాజారావుకి పైకం అందిస్తున్నాడు.

''రామ్మూర్తిగారూ, మీరు నిశ్చింతగా వుండండి. గెలుపు మీదే! ఓటర్లని మేం దగ్గరుండి తీసుకొస్తాం. మీరు అధిక మెజారిటీతో గెలుపు సాధిస్తారు చూడండి'' అన్నాడు రాజారావు, రామ్మూర్తికి నైతిక బలాన్ని అందిస్తూ.

రామ్మూర్తి, హుషారుగా లేడు- ఎలా వుండగలడు. ఎన్నో యేళ్ల శ్రమ ఫలితంగా రిటైరయిన తర్వాత చేతికొచ్చిన డబ్బులో కొంతయినా మంచినీళ్ల ప్రాయంగా ఖర్చయి పోతున్నందుకు వాడికి దిగులు పట్టుకున్నదేమో మరి.

''రాజారావుగారూ, రాజకీయ రంగంలో ఏమీ అనుభవం లేని నేను మీరు, మీ బృందంవారు అనుక్షణం అందించిన ప్రోత్సాహంతోనే ఈ ఎన్నికల బరిలోకి దిగానండీ. ఇప్పటికే కష్టార్జితమైన డబ్బు ఎంతో ఖర్చయింది. పాలముంచినా, నీట ముంచినా మీదే భారం...'' అన్నాడు రామ్మూర్తి. వాడిమాటల్లో నిస్పృహ తొంగి చూస్తోంది నిజంగానే, వాడిపట్ల జాలి కలిగింది.

రాజారావు, నిండుగా నవ్వేడు. అతనికి దిగులన్నదే లేదు. ఎందుకుంటుంది? ఆయన డబ్బేం పోలేదు కదా! పైగా నాలుగు డబ్బులు వెనకేసు కుంటున్నాడాయె.

''మీరు నిరుత్సాహ పడకండి రామ్మూర్తి గారూ! మీ మనో ధైర్యమే, మీ విజయానికి సోపానం! మీకు తెలీదేమో- మీరే ఖచ్చితంగా గెలుస్తారని, ఈ వార్డులో వాళ్ళంతా ఇప్పుడే అనుకుంటున్నారు. మీ ప్రత్యర్థుల గుండెల్లో గుబులు ప్రారంభమయ్యింది. మీరే చూస్తారుగా! మరి మేం వెళ్లొస్తాం... బోల్డు పనుంది...'' అంటూ లేచాడు రాజారావు.

''మంచిదండీ.''

''అన్నట్టు మర్చే పోయానుసార్... రాత్రింబవళ్లు ప్రచారంతోనే సరిపోవడంవల్ల మా బుర్రలు సరిగ్గా పన్జెయ్యడం లేదు. మరేం లేదండీ! రేపు ఆటోలలో ఓటర్లని చేర్చాలి కదా! ఓ అయిదొందలు ఇలా పడెయ్యండి'' అన్నాడు రాజారావు.

''మళ్ళీ అయిదొందలా?'' విస్తుపోతూ అన్నాడు, రామ్మూర్తి.

''బాగానే వుందంటున్నారులే! నేనే గెలుస్తానని కూడా హామీ ఇస్తున్నారు వీళ్ళు...'' అన్నాడు రామ్మూర్తి పేలవంగా.

''వాళ్లు అలా అనక తప్పదు. ఎందుకూ అంటే నీనుంచి డబ్బు గుంజుతున్నారు గనుక! వీళ్లు 'జలగలు' కేం తీసిపోరురా రామ్మూర్తీ. ఆఖరిసారిగా నీ దగ్గర అయిదొందలు లాగేశారు. చెప్పాను కదా, ఇటువంటి వారికి ఇదో వ్యాపారం. వీళ్ళు ఇట్లాగే మిగతా అభ్యర్థుల్ని మభ్యపెట్టి వారిలో ఆశలు పెంచి వారి దగ్గర్నుంచి కూడా డబ్బు గుంజుతున్నారేమో?'' అన్నాను.

గతుక్కుమన్నాడు రామ్మూర్తి.

''ఏవిట్రా నువ్వంటున్నది?'' ఆసక్తితో కాస్త ముందుకు వంగి ప్రశ్నించాడు రామ్మూర్తి. వాడి అమాయకత్వానికి జాలేసింది.

''ఔన్రా! అలా జరగకూడదని ఎక్కడుంది? రాజకీయాల్లో నీతి, నిజాయితీకి స్థానం పోయి ఎన్నాళ్లో అయింది.

ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయింది. ఆసక్తితో అందరూ ఎదురు చూస్తోన్న ఫలితాలు విడుదల అయ్యాయి. రామ్మూర్తి విజయం సాధించలేదు. అతని ప్రత్యర్థి రవి విజయం సాధించాడు.

''పోనీలే రామ్మూర్తీ! జరిగిందేదో జరిగింది. ఇప్పుడే మనుకున్నా ప్రయోజనం లేదు. ఆ డబ్బు నీదికాదు... పోయింది, ఇది నీకో గుణపాఠంరా! ఇక ముందెప్పుడూ ఇటువంటి పిచ్చిపనులు చెయ్యొద్దని నీకో హెచ్చరిక!'' అన్నాను.